సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 31 । జూలై । 2025



సంపద లేని కేంద్రాలు

గ్రామాల్లో చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాలను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో నిరుపయోగంగా తయారయ్యాయి. 8లో



ట్రయల్ రన్‌కే పరిమితం

ఎర్రకాలువ ఎత్తిపోతల పథకం రెండు దశాబ్దాలుగా ట్రయల్ రన్‌కే పరిమితమైంది. పనులు పూర్తిచేయకపోవడంతో పథకం నిరుపయోగంగా మారింది. 8లో



కొండ దిగి వస్తేనే సౌకర్యాలు

ఏజెన్సీలో ఉన్న మోదేలు గ్రామం అభయారణ్యం పరిధిలో ఉన్నందున కొండ దిగి వస్తే సౌకర్యాలు కల్పిస్తామని ఐటీడీఏ పీవో చెప్పారు. 8లో

సారుకు.. కోపమెచ్చింది!

- భీమవరంలో కూటమి నేతల అక్రమాలు
- మున్సిపాల్టీలోనూ పెచ్చుమీరిన అవినీతి
- గ్రామాల్లో సైతం అభివృద్ధి కమిటీల పేరిట వసూళ్లు
- ఏడాదికాలంగా పట్టించుకోని ఎమ్మెల్యే పులపర్తి
- అక్రమాల రెడ్‌జోన్‌లో భీమవరం నియోజకవర్గం?
- ఒక్కసారిగా ఏసీబీకి పట్టిస్తానంటూ అధికారులపై ఫైర్



సాక్షి, భీమవరం: బదిలీలు, సెటిల్‌మెంట్లు, జూదాల మాటున నేతలు దండుకునే పనిలో ఉన్నా.. గ్రామాభివృద్ధి కమిటీల పేరిట వసూళ్లు చేస్తున్నా.. మున్సిపాల్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెచ్చుమీరుతున్నా ఏడాది కాలంగా పట్టనట్టు ఎప్పుడు సౌమ్యంగా కనిపించే ఎమ్మెల్యే ఒక్కసారిగా ఫైరయ్యారు? పరిస్థితి మార్చుకోకపోతే తానే స్వయంగా ఏసీబీకి పట్టిస్తాననేంత కోపానికి కారణం ఏమై ఉంటుంది? పనిచేయని అధికారిని తాళ్లతో కట్టిపడేసిన వైనాన్ని ఎందుకు గుర్తుకు చేశారు. ఇప్పుడిదే భీమవరంలో హాట్ టాపిక్‌గా మారింది.

భీమవరం మున్సిపాల్టీకి సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అధికారులపై విరుచుకుపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే పులపర్తి దాదాపు ఏడాది కాలం తర్వాత రెండోసారి మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. ఇక్కడ ఏం జరుగుతుందో నాకు అంతా తెలుసు.. నేను ఏమీ అనని అనుకోవద్దు.. మీ పద్ధతులు మార్చుకోకపోతే నేనే ఏసీబీకి పట్టించేస్తానంటూ సీరియస్ అయ్యారు. ఇళ్ల కట్టుకునే వారి నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారులు రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారని, రెవెన్యూ, ఇంజినీరింగ్, శానిటేషన్ తదితర శాఖల్లో అవినీతి పెచ్చుమీరిందని మండిపడ్డారు. ఒకానొకదశలో నిజామాబాద్‌లో పని చేయకుండా ఉన్న ఏఈని స్థానికులు నడిరోడ్డుపై స్తంభానికి కట్టివేయడం తాను కళ్లారా చూశానని వివరిస్తూ అధికారులపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేశారు. ఎప్పుడూ సైలెంట్‌గా కనిపించే ఎమ్మెల్యే అంజిబాబు ఇంతలా ఎందకు ఆగ్రహం చెందారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

చూసీచూడనట్టుగా..

అధికారుల బదిలీల్లో కూటమి నేతలు కొందరు సొమ్ములు తీసుకుని పైరవీలు చేశారన్న ప్రచారం జరిగింది. షాడో అవతారమెత్తి పనుల్లో పర్సంటేజీలు, సెటిల్‌మెంట్లు, లిక్కర్ సిండికేట్ వ్యవహారాలు అన్నీ తామై చక్కబెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి నేతల అండదండలతో లిక్కర్ సిండికేట్ వేళాపాలా లేకుండా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేయడంతో పాటు మద్యం బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో సైతం అభివృద్ధి కమిటీల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడటంతో పాటు అందుకు రసీదులు ఇస్తున్న వైనం ఇటీవల భీమవరం రూరల్‌లోని ఒక గ్రామంలో వెలుగుచూసింది. నాన్ లేఅవుట్లు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్, కుళాయి కనెక్షన్లు తదితర వాటికోసం గ్రామాల్లో అభివృద్ధి కమిటీల మాటున వెలుగుచూడని అక్రమాలు మరెన్నో. మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెరిగింది. పాలకవర్గం లేక భీమవరం మున్సిపాల్టీపై అజమాయిషీ కొరవడింది. ఎమ్మెల్యే సైతం చూసీచూడనట్టు వ్యవహరించడంతో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, శానిటేషన్ తదితర విభాగాల్లో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపణలున్నాయి.

రెడ్‌జోన్ కారణమా ?

కూటమి ఏడాది పాలన సందర్భంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల పనితీరుపై ఇటీవల కూటమి పక్షాలు ఇంటెలిజెన్స్ వర్గాలు, సర్వేల ద్వారా నివేదికలు రప్పించుకుంది. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు రెండు చోట్ల మినహాయిస్తే ఐదు చోట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని గుర్తించినట్టు సమాచారం. నేతల సెటిల్‌మెంట్లు, పేకాట శిబిరాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పెచ్చుమీరిన అవినీతి తదితర వాటితో భీమవరం రెడ్‌జోన్‌లో ఉన్నట్టు నిఘావర్గాలు నివేదించినట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలో పాలన గాడితప్పుతుండటం, పార్టీ గ్రాఫ్ పడిపోతుండటాన్ని అధినాయకత్వం సీరియస్‌గా తీసుకున్నట్టు కూటమి వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు నేతలు, అధికారులు ఆగడాలు శృతిమించుతున్నా పట్టనట్టుగా సాగిపోయే ఎమ్మెల్యే అంజిబాబు దాదాపు ఏడాదికాలం తర్వాత సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి ఫైర్ కావడం వెనుక రెడ్ జోన్ ఒక కారణం కావచ్చునన్న చర్చ జరుగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష

పెనుగొండ: పెనుగొండలోని ఎస్వీకేపీ అండ్ కోట్ల వెంకట్రామయ్య బాలికోన్నత ఎయిడెడ్ పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయులకు డీఈఓ అమలు చేసిన ఆన్‌లైన్ పరీక్షా విధానం నిబంధనలకు విరుద్ధంగా ఉందని పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కే.రామచంద్రరాజు అన్నారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ జీఓలో పేర్కొన్న మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నట్లు యాజమాన్యం గుర్తించిందన్నారు. పరీక్షా విధానం, అభ్యర్థుల జాబితా విడుదలకు సంబంధించి నేరుగా యాజమాన్యానికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఆన్‌లైన్ పరీక్షా ఫలితాలు, నియామకాలు తుది తీర్పు వెలువడిన తరువాత మాత్రమే ప్రకటించాల్సి ఉందన్నారు.

పేద వర్గాలకు చేయూత నివ్వాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పీ4లో భాగంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఛాంబరులో రైస్ మిల్లర్స్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో దిగువ పేద వర్గాల వారిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని, కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారికి చేయూతనిస్తే వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. జిల్లాలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తమ వంతు సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారన్నారు.

న్యూస్‌రీల్

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు వద్ది రఘురాం

తాడేపల్లిగూడెం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు వద్ది రఘురాం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఆక్వా రైతులు, ఇతర రైతుల పరిస్థితి గురించి అధినేతకు వివరించినట్టు చెప్పారు.

బకాయిలు విడుదల చేయాలి



భీమవరంలో నిర్వహించిన ఏఐఎస్ఏ సమావేశం

భీమవరం: ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం భీమవరం పట్టణంలోని శ్రీ గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలిలో ఎం.రాజేష్ అధ్యక్షతన జరిగిన ఏఐఎస్ఏ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని కళాశాలల్లో ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు హాల్ టికెట్స్ ఇస్తామని విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు పి రామ్‌ప్రసాద్, డి ప్రకాష్, సాయిసుమంత్ , టి పార్దు వెంకట్, కె సాయి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేసిన జేసీ



ఉమామహేశ్వరంలో రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

పెంటపాడు: పెంటపాడు మండలం తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డు రూంను పరిశీలించారు. పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామానికి సంబంధించిన ఇనామ్ రికార్డులను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెంటపాడు మండలం ముదునూరుపాడులో రేషన్ షాపును తనిఖీ చేశారు. నిత్యావసరాలు సకాలంలో అందజేయాలని రేషన్ షాపు డీలర్‌ను ఆదేశించారు. వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి అందజేయాలని సూచించారు.

ద్వారకాతిరుమలలో భారీ వర్షం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం జల్లులు పడగా, రాత్రికి వర్షం ఊపందుకుంది. గంటపాటు ఎడతెరపి లేకుండా భారీగా వర్షం కురిసింది. దీంతో చినవెంకన్న ఆలయ మెట్ల మార్గంలోంచి నీరు వరదలా ప్రవహించింది. కొండపైన తూర్పు ప్రాంతంలోకి భారీగా వర్షం నీరు చేరింది. వర్షం ఆగిన తర్వాత నీరు దిగువ ప్రాంతానికి ప్రవహించింది.

స్మార్ట్ ఒప్పందాలు రద్దు చేయాలి



భీమవరం విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పాదయాత్ర చేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజల్లోనికి తీసుకువెళతామని స్మార్ట్‌మీటర్ల ఒప్పందాలను రద్దుచేసి ప్రజలపై భారాలు తగ్గించేవరకు ఆందోళన తప్పదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్ల వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులను వివరించడానికి బుధవారం భీమవరం పట్టణంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. సీఐటీయూ కార్యాలయం వద్ద ప్రారంభమైన పాదయాత్ర ప్రకాశం చౌక్, రెస్ట్‌హౌస్ రోడ్డు, మావుళ్ళమ్మ గుడి మీదుగా కరపత్రాలు పంపిణీ చేస్తూ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు జెఎన్‌వీ గోపాలన్, చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ఇప్పటికే వివిధ రకాల విద్యుత్ చార్జీలను ప్రజలపై మోపి పీడిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో తట్టుకోలేని భారాలను ప్రజలపై మోపాలని చూస్తుందని విమర్శించారు. బిల్లులు చెల్లించే పద్ధతిలో మార్పు, అదనపు భారాలు వేయడం, అదుపు లేకుండా చార్జీలు పెరిగిపోవడం వంటివి ఎన్నో ఇబ్బందులు విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల ఏర్పడతాయన్నారు. కూటమి నాయకులు గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి అధికారం చేపట్టాక వాటిని రద్దు చేయకుండా ప్రజలకు బలవంతంగా అంటగట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. వచ్చే నెల 2న పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5న కరెంట్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని గోపాలన్, రంగారావు చేప్పారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు మహంకాళరావు, బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంతరావు, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డేగల నాగేశ్వరరావు, గోపాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర ఫుల్.. సరుకు నిల్

- వైరస్ దెబ్బతో ఆక్వా చెరువులు ఖాళీ
- లబోదిబోమంటున్న రొయ్య రైతులు



బ్లీచింగ్ చల్లి ఎండగట్టిన చెరువు

గణపవరం: నిన్న మొన్నటి వరకూ రొయ్యకు ధర లేదు. సాగు గిట్టుబాటు కావడం లేదని, క్రాప్ హాలిడే ప్రకటిస్తామని రైతులు రోడ్డెక్కారు. ఇప్పుడు రొయ్య ధర కనీవినీ ఎరుగని విధంగా పెరిగిపోయింది. 100 కౌంట్ రొయ్య ధర కిలో రూ.280 పలుకుతుంది. ఈ ధర రూ.300కు చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. రెండు వారాల కిత్రం కిలో రూ.220 పలికిన ఈ కౌంట్ ధర అమాంతం కిలో రూ.190కు పడిపోయింది. ప్రస్తుతం రొయ్య ధర రోజురోజుకు పెరిగిపోతూ రొయ్య రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. వారం వ్యవధిలోనే కిలో రూ.280కు చేరింది. ఈ ధర మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రొయ్య ధర అమాంతం పెరిగిపోతుంది. ఇంకేముంది రొయ్య రైతులకు మంచి రోజులు వచ్చాయని అనుకుంటే పొరపాటే.. రొయ్య ధర పెరిగినా సాగులో ఉన్న చెరువులు మొత్తం వైరస్ దెబ్బకు ఖాళీ అయ్యాయి. ఏడో వేళ్ల మీద లెక్కపెట్టగలిగే అరకొరగా మాత్రమే రొయ్య సాగు జరుగుతుంది. అది కూడా ప్రస్తుతం చాలా తక్కువ కౌంట్ సైజులో మాత్రమే ఉంది. దీంతో రొయ్యధర పెరిగినా తమకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

వైరస్ దెబ్బకు చెరువులు ఖాళీ

ఉమ్మడి జిల్లాలో 1.20 లక్షల ఎకరాలలో రొయ్య సాగు జరుగుతుండగా ప్రస్తుతం 25 శాతం చెరువుల్లో మాత్రమే సాగు జరుగుతుంది. గత వేసవిలో రైతులను ఆదుకోవాల్సిన సాగు చావు దెబ్బ తీసింది. అకాల వర్షాలు, వాతావరణ మార్పులతో తెగుళ్లు విజృంభించి చెరువులు ఖాళీ అయ్యాయి. కౌంట్‌కు రాకుండానే వేల ఎకరాలలో రొయ్యలను పట్టేసి అయినకాడికి అమ్ముకున్నారు. ఒక్కసారిగా 100 కౌంట్ రొయ్యధర రూ.225 నుంచి రూ.200కు పడిపోయింది. గత్యంతరం లేక రైతులు ఆ ధరకే రొయ్యలను అమ్ముకోక తప్పలేదు. వైరస్ దెబ్బకు ఖాళీ అయిన చెరువులలో జూలై నెలారంభం నుంచి మళ్లీ సీడ్ వేయడం ప్రారంభించారు. ఇంకా చాలా చెరువులు ఖాళీగానే ఉన్నాయి. బ్లీచింగ్, సున్నం వంటివి చల్లి ఆరబెట్టి ఉంచారు.

ఉంగుటూరు నియోజకవర్గం నాలుగు మండలాలలో రొయ్యసాగు సుమారు ఐదు వేల ఎకరాలలో సాగుతుంది. వేసవిలో వాతావరణ మార్పుల కారణంగా వైట్ స్పాట్ ఇతర వైరస్ వ్యాధులు విజృంభించడంతో 50 శాతం చెరువులు ఖాళీ అయ్యాయి. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాల కారణంగా మిగిలిన చెరువులలో ఆక్సిజన్ సమస్యతో రొయ్యలను అర్ధాంతరంగా పట్టేసి అయినకాడికి అమ్ముకున్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా సన్న, చిన్నకారు రైతులే రొయ్యసాగు చేస్తున్నారు. వీరంతా వైరస్ వ్యాప్తితో ఈ పంట మొత్తం కోల్పోయి, నష్టాలు మూటకట్టుకున్నారు.

దిగుబడి బాగుంటే ధర ఉండదు



రొయ్య దిగుబడి బాగున్నప్పుడు ధరలు పతనమవుతాయి. చెరువులు ఖాళీ అయ్యాక ధరలు ఎగిసిపడతాయి. ఇది రొయ్య రైతుల దయనీయ పరిస్థితి. ఏడాది పొడవునా ఇదే పరిస్థితి. ఇది మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం. ప్రస్తుతం జిల్లాలో వివిధ కారణాలతో 80 శాతం రొయ్యల చెరువులలో పట్టుబడులు చేసేశారు. ఇప్పుడు పెరిగిన ధరలు ఏ కొద్దిమంది రైతులకో తప్ప ఎక్కువ రైతులకు ఏ మాత్రం ఉపయోగపడవు. రొయ్యల ధర, మేతలు, మందుల ధరలపై ప్రభుత్వ పూర్తి నియంత్రణ ఉంటేనే రైతులకు ఉపయోగం.

-కాకర్ల వినాయకం, ఆక్వా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు

మానవ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): మానవ అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో బుధవారం అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, సామాజిక కార్యకర్తలు, సంఘ స్థాయి సభ్యులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రత్నప్రసాదు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా సమాజంలో పెనుసవాల్‌గా మారిందని, సమాజం సమష్టి కృషితో నిరోధించాలని సూచించారు. ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతులు చేయడం కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు అక్రమ రవాణా నిరోధించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. అక్రమ రవాణాకు గురైన బాధితులకు రక్షణ, పునరావాస సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): పోలవరం కాంటూరు లెక్కలన్నీ కాకి లెక్కలేనని, తక్షణం వాటిని రద్దు చేసి నిర్వాసితులందరికీ ఒకే విధమైన పరిహారం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. న్యూఢిల్లీలో జరిగిన భూమి అధికార్ ఆందోళన జాతీయ సమావేశంలో ఏలూరు జిల్లా నుంచి రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, భూ సమస్యలు, ఇళ్ల స్థలాల సమస్యలు, పేదల సమస్యలపై మాట్లాడినట్లు చెప్పారు. పోలవరం నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి ఇళ్లు ఖాళీ చేయించే నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ యూనిట్‌గా గుర్తించి రూ.10 లక్షలు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. మార్కెట్ రేటుకు 4 రెట్లు అదనంగా పరిహారం ఇవ్వాలని, ఇళ్లు, పశువులు, చెట్లకు సంబంధించి పరిహారం ఇవ్వాలని, రవాణాకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. పునరావాస కాలనీల్లో ఇళ్లను నాణ్యంగా నిర్మించాలని, రోడ్లు, తాగు నీరు, మురుగు కాలువలు, విద్యుత్తు సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు.



క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీలో ముగిసిన ప్లేస్‌మెంట్ స్కిల్స్ శిక్షణ



శిక్షణ ఇచ్చిన ఫ్యాకల్టీకి మెమొంటోలు అందజేస్తున్న డైరెక్టర్

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన ఈ4 విద్యార్థులకు ప్లేస్‌మెంట్ స్కిల్స్ పెంపొందించేందుకు గాను విద్యార్థులకు గత పదిరోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్యాల పెంపుదల శిక్షణ బుధవారంతో ముగిసింది. యునైటెడ్ వే సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ (సీడీపీసీ) ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా దీనిలో మొత్తం 300మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు అప్టిట్యూడ్, రీజనింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ ఫ్యాకల్టీలకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మణరావు, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి రుద్రం చింతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ముదినేపల్లి రూరల్: పెయ్యేరు పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో కె అనురాధ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరగడంతో పాటు పాలనా పరమైన అంశాల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గ్రామానికి చెందిన కొందరు గతంలో ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై విచారణ అనంతరం నివేదిక ఆధారంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేసినట్లు సమాచారం. చెక్‌పవర్ రద్దుపై వారం రోజుల లోపు సర్పంచ్ కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని డీపీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎక్సైజ్ పోలీసులమంటూ బురిడీ

నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

అత్తిలి: ఎక్సైజ్ పోలీసులమంటూ ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి అతని వద్ద నుంచి నగదు కాజేసి పరారవుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు తెలిపిన వివరాల ప్రకారం కంచుమర్రు గ్రామంలో కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తున్న డి.నాగ వెంకట అశోక్ వద్దకు బుధవారం ఉదయం నలుగురు వ్యక్తులు ఒక కారులో వచ్చి ఎక్సైజ్ పోలీసులమని నమ్మబలికారు. గుట్కా, మందు విక్రయిన్నావని బెదిరిస్తూ అతని వద్ద నుంచి రూ.2 వేలు బలవంతంగా వసూలు చేసి వెళ్లిపోయారు. వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తక్షణమే రంగంలోకి దిగిన పోలీసులు మంచిలి రోడ్డులో కారులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ముగ్గురు ఎన్టీఆర్ జిల్లా జగయ్యపేటకు చెందిన వారు కాగా, ఒకరిది కృష్ణాజిల్లా కృత్తివెన్ను గ్రామం అని గుర్తించారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నలుగురు నిందితులను అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ప్రేమరాజు చెప్పారు.

సంపద లేని కేంద్రాలు

- చెత్త రాదు.. ఎరువు తయారు కాదు
- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



రెడ్డిగణపవరంలో నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

బుట్టాయగూడెం: గ్రామాల్లో చెత్తాచెదారాన్ని సేకరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చెత్త నుంచి సంపద వచ్చేలా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరుగా సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉపయోగపడుతుందన్న లక్ష్యంతో ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రంలో ఈ షెడ్లను నిర్మించారు. గత ప్రభుత్వ పాలన సమయంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలు నేడు పట్టించుకునే నాథుడు లేక పోవడంతో నిరుపయోగంగా మారాయి.

చాలాచోట్ల నిరుపయోగంగా..

జిల్లావ్యాప్తంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో అధికారుల నిర్వహణా లోపం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. తడి, పొడి చెత్త సేకరణకు సరైన సిబ్బందిని కూడా కేటాయించకపోవడంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఉదాహరణకు.. బుట్టాయగూడెం మండలంలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిని 18 గ్రామ సచివాలయాలుగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద తయారు చేయడానికి షెడ్లను నిర్మించారు. అయితే వీటిలో కేవలం మూడు మినహా మిగిలిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణలో సిబ్బంది కొరత కూడా ఉన్నట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై మాత్రం దృష్టి పెట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా పంచాయతీల పరిధిలో అవసరమైన మేరకు గ్రీన్ అంబాసిడర్‌లను ఏర్పాటు చేసి సంపద కేంద్రాల నిర్వహణకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

రెడ్డిగణపవరంలో నిరుపయోగంగా..



బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. తోపుడు రిక్షాలు కూడా మూలన పడ్డాయి. కనీసం అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తడి, పొడి, చెత్త సేకరణ చేసి సంపద కేంద్రాలను ఉపయోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.– అందుగుల ఫ్రాన్సిస్, కేవీపీఎస్ నాయకులు, రెడ్డిగణపవరం

పంచాయతీలో ఆదాయం లేదు



గత ఆరు నెలలుగా పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. దీనితో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అనేక అవస్థలు పడుతున్నాం. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లలేని పరిస్థితిలో ఉన్నాం. గ్రీన్ అంబాసిడర్‌లు నెలకు రూ.15 వేలు అడుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో సిబ్బంది కొరతతో అనేక అవస్థలు పడుతున్నాం. –ఉయికే బొజ్జి, సర్పంచ్, కేఆర్‌పురం

జెడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఎగువ శ్రేణి సహాయకులకు పరిపాలనాధికారులుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం యలమంచిలి మండల పరిషత్‌లో పని చేస్తున్న సీహెచ్.ఎ.పద్మజ, కాళ్ల మండల పరిషత్‌తో పనిచేస్తున్న జి.నాగేశ్వరరావులకు ఉత్తర్వులను అందజేశారు. కాగా ఇప్పటి వరకు 74 మందికి పదోన్నతులు కల్పించామని, వారిలో ఏవోలుగా 29 మంది, సీనియర్ అసిస్టెంట్‌లుగా 31మంది, జూనియర్ అసిస్టెంట్‌లుగా ఆరుగురు, రికార్డ్, లైబ్రరీ, ల్యాబ్ అసిస్టెంట్‌లుగా 10 మందికి పదోన్నతులు కల్పించినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భీమవరం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు చెప్పారు. ఈనెల 26వ తేదీన ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి సొమ్మసిల్లి పడిపోగా అధికారులు 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 94407 96632, 94407 96633 నంబర్లలో సంప్రదించాలని సీఐ నాగరాజు కోరారు.

కొండ దిగి వస్తే సౌకర్యాలు కల్పిస్తాం

ఐటీడీఏ పీఓ రాములు నాయక్



అటవీప్రాంతంలోని మోదేలు గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని బాహ్య ప్రపంచానికి దూరంగా మారుమూల అటవీప్రాంతంలో ఉన్న మోదేలు గ్రామాన్ని ఐటీడీఏ పీఓ కె. రాములు నాయక్, వివిధ శాఖలకు చెందిన అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మోదేలు గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మోదేలు గ్రామం ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా రోడ్డు, విద్యుత్ సౌకర్యం లేక అనే అవస్థలు పడుతున్నామని గిరిజనులు ఇటీవల రాష్ట్రపతికి లేఖ రాశారు. గత ప్రభుత్వంలో మోదేలు గ్రామానికి రోడ్డుతోపాటు విద్యుత్ సౌకర్యం కూడా మంజూరైందని, అయితే పనులు చేపట్టేందుకు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు చెబుతున్నారని లేఖలో తెలిపారు. ఈ లేఖకు సంబంధించి తాను కూడా ఢిల్లీ వెళ్లానని, కలెక్టర్ ఆదేశాల మేరకు మోదేలు గిరిజనులతో మాట్లాడేందుకు వచ్చినట్లు పీవో తెలిపారు. మోదేలు గ్రామం వన్యప్రాణుల అభయారణ్యం పరిధిలో ఉందని ఇక్కడ రోడ్డు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశాలు లేవని ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు చెబుతున్నారని పీఓ చెప్పారు. ఈ నేపథ్యంలో మోదేలు గిరిజనులు కొండదిగి వస్తే బుట్టాయగూడెం మండలం డోలుగండి పరిసర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంతోపాటు రోడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇతర సౌకర్యాలు కూడా కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. దీనిపై గ్రామస్తులంతా ఆలోచన చేసి ఒక అంగీకారానికి వస్తే సౌకర్యాల ఏర్పాటుకు ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో అలివేరు సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరావు, గిరిజన సంక్షేమ శాఖ డీఈ ఎం. శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పట్ల చిన్నయ్య, ఏఎంఓ శిరమయ్య, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం రేంజ్‌లకు చెందిన ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఫ్యాప్టో ధర్నా సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఫ్యాప్టో సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పవర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని తదితర 18 డిమాండ్లతో ధర్నా తలపెట్టినట్టు చెప్పారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆగస్టు 2న నిర్వహించే ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో చైర్మన్ జీ.మోహన్, సెక్రటరీ జనరల్ ఎం.ఆదినారాయణ, కో చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, జి. ప్రకాష్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కె.రవికుమార్, పవన్ కుమార్, సీహెచ్ శివరాం, ఐ.రమేష్, టి.రామరావు కార్యవర్గ సభ్యులు కె.కాంతారావు, ఈ.రామ్మోహన్, ఎన్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన కేసులో ఏడాది జైలు

ఏలూరు (టూటౌన్): మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధించింది. వివరాల ప్రకారం ఏలూరులో మైనర్ బాలిక ఫిబ్రవరి 13, 2019న పాఠశాల నుంచి ఇంటికి వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు ఆమె పట్ల అసభ్యకరంగా సైగలు చేస్తూ వేధింపులకు గురి చేశారు. ఈ విషయంపై బాలిక తన తల్లిదండ్రులకు తెలియజేయగా బాలిక తల్లి ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై కె.వెంకన్న కేసు నమోదు చేసి నిందితులు ఏలూరు ఎన్ఆర్‌పేటకు చెందిన కాళిదాసు సాయికుమార్, పత్తేబాద ఎరుకుల కాలనీకి చెందిన తల్లూరి దాసులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. వాదనలు అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధిస్తూ ఏలూరు జిల్లా స్పెషల్ జడ్జి స్పీడ్ ట్రైల్ ఆఫ్ ఆఫెన్స్ అండర్ పోక్సో యాక్ట్ కోర్టు జడ్జి కె.వాణిశ్రీ బుధవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.అమర శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కె అశోక్ కుమార్, కోర్ట్ మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ కోర్టు మహిళా కానిస్టేబుల్ పి.పద్మ, చిరంజీవి, కోర్ట్ మానిటరింగ్ సెల్ సభ్యులు సకాలంలో సాక్షాలను ప్రవేశపెట్టి విచారణకు సహకరించారు.

వక్ఫ్ ఆస్తులకు నోటీసులు

డిపార్టుమెంట్‌కే అద్దె చెల్లించాలని సూచన



షాపులకు నోటీసులు ఇస్తున్న వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఆలీమ్

ఆకివీడు: స్థానిక ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలో ఉన్న ముస్లిం కాంప్లెక్స్, మసీదులకు సంబంధించి బుధవారం జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ కేఎండీ.ఆలీమ్ నోటీసులు అందజేశారు. వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న ఆస్తులకు సంబంధించి అద్దెలు సక్రమంగా జమ కావడంలేదని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఇకపై నేరుగా అద్దెలు, ఇతర సొమ్ముల జమను తమకే చెల్లించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. ఈమేరకు వక్ఫ్ ఆస్తులకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు ఆలీమ్ చెప్పారు. స్థానికంగా మూడు మసీదులకు, ఈద్గా, చౌల్ట్రీ, ఇతర షాపులకు సంబంధించి లావాదేవీలు ఇకపై తమ పరిధిలోనే జరుగుతాయని చెప్పారు. కమిటీ ఏర్పాటు చేసేంతవరకూ ఈ విధానం కొనసాగుతుందన్నారు. నోటీసుల్ని ఆలీమ్‌తో పాటు సబార్డినేట్ బహదూర్ షాపు, మసీదు గోడలపై అతికించారు.

పురపాలక సంఘం - పాలకొల్లు

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.181/2025/ఇ1 తేది.30-07-2025

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని [illegible] 4 పనులు [illegible] రూ.56,04,000/- [illegible] ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా షార్టు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూల్లు ఇ-ప్రొక్యూర్‌మెంటు [illegible] తేది.31-07-2025 [illegible]

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ	: 31-07-2025 సాయంత్రం గం.04.00 ని.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేదీ	: 06-08-2025 సాయంత్రం గం.04.00 ని.లకు
ప్రైస్ బిడ్ తెరుచు తేదీ	: 06-08-2025 సాయంత్రం గం.04.30 ని.లకు

పూర్తి వివరములకు ఇ ప్రొక్యూర్‌మెంటు వెబ్‌సైట్ www.tender.apeprocurement.gov.in లేదా [illegible] పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా [illegible] సంప్రదించగలరు.

కమీషనరు
పురపాలక సంఘం, పాలకొల్లు

పాము కాటుతో రైతు మృతి



భాస్కరరావు మృతదేహం

మునునూరు: పాము కాటుకు ఓ రైతు బలయ్యాడు. వివరాల ప్రకారం అక్కిరెడ్డిగూడెంకు చెందిన రైతు ముత్తంశెట్టి భాస్కరరావు(65) బుధవారం తన పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. స్థానికులు అతడ్ని హుటాహుటీన నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలిస్తూ ఉండగా, మార్గ మధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి క్రీడల్లో సత్తా చాటిన తన్మయ



తన్మయని అభినందిస్తున్న దృశ్యం

పెంటపాడు: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పెంటపాడు ప్రభుత్వ పోస్ట్ బేసిక్ హైస్కూల్ ప్లస్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సత్తి తన్మయ శ్రీదేవి సత్తా చాటింది. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా స్పెషల్ ఒలింపిక్స్ భారత్ నిర్వహించిన బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో మహిళల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకోవడంతోపాటు పార్ట్‌నర్ విభాగంలో సాధారణ బాలికతో కలిసి కాంస్య పథకాన్ని కూడా అందుకుంది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో బిలాస్పూర్ అటల్ బిహారీ వాజ్‌పేయి విశ్వవిద్యాలయంలో ఈనెల 24 నుంచి 28 వరకు జరిగిన జాతీయ స్థాయి బేస్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పోటీలకు దేశంలో 22 రాష్ట్రాల నుంచి 250 మందికి పైగా దివ్యాంగులు హాజరుకాగా అందులో అత్యుత్తమ తన్మయ శ్రీదేవి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, స్పెషల్ ఒలింపిక్స్ భారత్ నేషనల్ స్పోర్ట్స్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ రాజశేఖర్ చేతులమీదుగా బంగారు పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని అందుకుంది.

వాసవీ యాజమాన్యం ఔదార్యం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాసవీ ఇంజనీరింగ్ యాజమాన్యం

తాడేపల్లిగూడెం: కేన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి చికిత్సకు పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ఆర్థిక సహాయం అందజేసి ఔదార్యం చూపించింది. ఏలూరుకు చెందిన కె.శివయ్య దంపతుల పెద్ద కుమార్తె శ్రావ్య (5) కేన్సర్ వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి చికిత్స కోసం రూ.5 లక్షలు అవసరం కాగా ఖర్చును భరించే లేని స్థితిలో ఆ కుటుంబం ఉంది. ఈ విషయం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం దృష్టికి వచ్చింది. దీంతో విద్యార్థులు రూ.45570 సేకరించగా, కళాశాల మేనేజ్‌మెంటు రూ.45 వేలు, కళాశాల కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు వ్యక్తిగతంగా రూ.10 వేలు కలిపి మొత్తం రూ.1,00,570 బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాలుగా ట్రయల్ రన్‌కే పరిమితం



ఈస్ట్ యడవల్లిలో ఎర్రకాలువ ఎత్తిపోతల పథకం భవనం



నిరుపయోగంగా నీరు అందించే పైపులైన్లు

నిరుపయోగంగా ఎర్రకాలువ ఎత్తిపోతల పథకం

కామవరపుకోట: ఆంధ్రప్రదేశ్ ఎర్రకాలువ ఎత్తిపోతల పథకం రెండు దశాబ్దాలుగా ట్రయల్ రన్‌కే పరిమితమైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 9 కోట్లు కేటాయించినా పనులు సక్రమంగా పూర్తిచేయకపోవడంతో ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. మెట్ట ప్రాంతంలోని కామవరపుకోట, ద్వారకాతిరుమల మండలాల్లోని కొన్ని గ్రామాల రైతులకు నీటి వసతి కల్పించేందుకు 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఎర్ర కాలువ ఎత్తిపోతల పథకం చేపట్టింది.

రూ.9 కోట్లతో నిర్మాణ పనులు

రూ.9 కోట్లు నిధులు కేటాయించి కామవరపుకోట మండలంలోని ఈస్ట్ యడవల్లి సమీపంలో సుమారు 103 ఎకరాల విస్తీర్ణం గల గిరమ్మ చెరువు వద్ద నిర్మాణ పనులు చేపట్టారు. మూడు కిలోమీటర్ల వరకు పైపులైను వేసి అక్కడ నుంచి కాలువను తవ్వారు. ఈ కాలువను తవ్వుతుండగా ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ పొలాల మీదుగా కాలువ తవ్వవద్దంటూ అడ్డుకుని హైకోర్టును ఆశ్రయించారు. దీనితో కొంతకాలం పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత ఆనాటి జిల్లా కలెక్టర్ నష్టపరిహారం ఇస్తామని రైతులకు నచ్చజెప్పి మరలా పనులు ప్రారంభించారు. ఆ కాలువను ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు వద్ద రెండు పాయలుగా విభజించి ఎడమ కాలువ ద్వారా ద్వారకాతిరుమల మండలంలోని చెలికానివారిపోతేపల్లి, దొరసానిపాడు, కుడి కాలువ ద్వారా కామవరపుకోట మండలంలోని ఈస్ట్‌యడవల్లి, వెంకటాపురం, రావికంపాడు గ్రామాల్లోని చెరువులను నింపి రైతులకు నీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు.

7 వేల ఎకరాల సాగు లక్ష్యం

ఈ ఎత్తిపోతల పథకం ద్వారా రెండు మండలాల్లోని సుమారు 6 గ్రామాల చిన్న సన్నకారు రైతులకు సాగునీరు అందించి 7 వేల ఎకరాలు సాగులోకి తీసుకురావాలనేది లక్ష్యం. దీనిద్వారా ఆయకట్టు కింద పామాయిల్, కోకో, కొబ్బరి అరటి వంటి పంటల ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. అయితే ఈ ఎత్తిపోతల పథకం పనులను అప్పటి టీడీపీ ప్రభుత్వం సక్రమంగా చేపట్టకపోవడంతో రెండు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఈ ప్రాజెక్టు నిరుపయోగంగానే మారింది. పైప్‌లైన్ పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఎత్తిపోతల పథకం ద్వారా కాలువలకు సక్రమంగా నీరు చేరడం లేదు. దీంతో అప్పుడప్పుడు అధికారులు రావడం.. ట్రయల్ రన్ వేయడం తప్ప ఎత్తిపోతల పథకాన్ని ఉపయోగంలోకి తీసుకురావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ ఎత్తిపోతల పథకాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చి మెట్ట ప్రాంత రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

మెట్ట ప్రాంత రైతులను ఆదుకోవాలి



కోట్లాది రూపాయల నిధులు కేటాయించి చేపట్టిన ఎత్తిపోతల పథకం నిర్మాణం నిరుపయోగంగా ఉంది. మెట్ట ప్రాంతంలో సన్న, చిన్నకారు రైతుల వేలాది ఎకరాలు వర్షాధారం మీద ఆధారపడి ఉన్నాయి. ప్రభుత్వం ఎర్రకాలువ ఎత్తిపోతల పథకాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చి రైతులను ఆదుకోవాలి.

– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలోని, చెరువు ఆయకట్టు కింద రైతులు సాగునీరు అందక నానా అవస్థలు పడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చి రైతులకు సాగునీరు అందించాలి.

– మద్దుకూరి సత్యనారాయణ, రైతు, ఈస్ట్ యడవల్లి

బంగారు ఆభరణాల చోరీపై ఫిర్యాదు

కై కలూరు: బంగారు ఆభరణాలు కలిగిన పర్సును పట్టపగలే దొంగిలించిన ఘటనపై పోలీస్ కేసు నమోదైంది. వివరాల ప్రకారం ఆటపాక గ్రామానికి చెందిన పాతగొలుసు రాములు కొన్ని నెలల క్రితం కైకలూరు గాంధీబొమ్మ సెంటర్ బంగారు దుకాణంలో గొలుసు, చెవిదిద్దులు, ఉంగరం ఇలా కాసున్నర బంగారు వస్తువులను తాకట్టుపెట్టారు. బుధవారం తిరిగి డబ్బులు చెల్లించి ఆ ఆభరణాలను పర్సులో పెట్టుకుని రాములు, అతని భార్య, కుమార్తె వస్తున్నారు. మార్గంలో పాత పెట్రోలు బంకు సమీపంలో రూ.10 వస్తువులు విక్రయించే దుకాణానికి వెళ్లి అక్కడ కొన్ని సామాన్లు కొనుగోలు చేసిన అనంతరం సంచిలో వెతికితే పర్సు కనిపించలేదు. దీనిపై బాధితుడు రాముడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



DISTANCE EDUCATION

■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D.ఫార్మసీ, B.ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి ✆ 9989530727 [SCA25006840]



■ కష్టలైన్నీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-16111]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9949021122 [B-1275595]



గమనిక : సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సింది గా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

అత్తిలి: గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి తగిన సూచనలు ఇవ్వాలని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగాం మోనిటరింగ్ ఆఫీసర్ డా. ఎం గులాబ్ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో నిర్వహిస్తున్న 104 వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. టీబీ, క్యాన్సర్ కేసులు, ఎన్‌సీడీ-సీడీ సర్వేపై వైద్యులనుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మంచిలి వైద్యాధికారి డాక్టర్ పి కిరణ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కపర్థేశ్వరుడికి వెండి వితరణ



శ్రీకపర్థేశ్వరస్వామి ఆలయ అర్చకులకు వెండి దారాపాత్రను బహూకరిస్తున్న దాతలు

తణుకు అర్బన్: తణుకు పాతవూరులోని పార్వతీ, శ్రీకపర్థేశ్వరస్వామి వారికి పట్టణానికి చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి దంపతులు రెండు కిలోల వెండి దారాపాత్రను బుధవారం బహూకరించారు. స్వామివారికి నిత్య పూజాధికాల్లో ఉపయోగించే విధంగా రూపొందించిన వెండి దారాపాత్రను బహూకరించడం మంచి పరిణామమని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధ్యాయుల జీతాల సమస్యను తక్షణమే పరిష్కరించాలి

తణుకు అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిగి రెండు నెలలు అవుతున్నప్పటికీ రీఅపోర్షన్లో అప్ గ్రేడ్ అయిన పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంత వరకు పొజిషన్ ఐడీలు, జీతాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల కాకపోవటం బాధాకరమని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వేంద్ర రామమోహన్, ఉపాధ్యక్షుడు అల్లం వీరభద్రరావు తెలిపారు. ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు లేక కుటుంబ నిర్వహణకు, బ్యాంకుల ఈఎంఐలు బకాయలు పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యాశాఖలో ప్రతి పనిని మోస్ట్ అర్జెంటు అని చేయించే అధికారులు జీతాల విషయంలో నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకుని ఉపాధ్యాయుల జీతాల సమస్యను పరిష్కరించాలని కోరారు.

గ్రామాల్లో ఎన్‌సీడీ పీవో పర్యటన



దండగర్రలో ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్న ఎన్‌సీడీ పీవో రాజేష్ తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర, మోదుగ గుంట గ్రామాల్లో బుధవారం నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఎంవీవీఎస్ రాజేష్, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ సుభాష్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ.వెంకటేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. నోటి, గర్భాశయ, రొమ్ము కేన్సర్‌లకు స్క్రీనింగ్‌తో పాటు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు ఎన్‌సీడీ పీవో రాజేష్ వివరించారు. ఒకరి నుంచి మరొకరికి సంక్రమించని వ్యాధుల్లో గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా ఉండి నెమ్మదిగా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు ఎన్‌సీడీలే ప్రధాన కారణం అన్నారు. ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుర్రపుడెక్కతో వర్మీ కంపోస్ట్ తయారీ

పెనుగొండ: గుర్రపు డెక్కతో వర్మీ కంపోస్ట్ తయారు చేయవచ్చని, తద్వారా సంపద సృష్టి చేయవచ్చని ఆచంట ఎంపీడీఓ బిక్కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మండలంలోని బోదేలు, కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్కను ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా వెలికి తీయించి ఎండిన గుర్రపు డెక్క చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగ పడే విధంగా వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.బులిసూరన్న పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

భీమవరం: భీమవరం పట్టణంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పెన్నాడ గ్రామంలోని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు బుధవారం భోజనాలు అందించారు.

దోమలు.. బాబోయ్ దోమలు

- ప్రబలనున్న సీజనల్ వ్యాధులు
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి కాలం వెళ్లి రుతు పవనాలు రావడంతో వర్ష కాలం వచ్చింది. మండే వేసవి నుంచి వేడి నుంచి వర్షాలు ఉపసమనం కలిగిస్తాయి. చల్లదనాన్ని ఇస్తాయి. వర్షాలతో పాటు వ్యాధులు ప్రబలే సీజన్ కావడంతో వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తత ఎంతో అవసరం. అంటురోగాలు ప్రబలతాయి. అధిక తేమ, నిలిచిపోయిన నీరు, తేమతో కూడిన పరిస్థితులు ఉండటంతో ముఖ్యంగా బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంద్రాలు, వ్యాధులను మోసే కీటకాలకు సంతానోత్పత్తికి అనువైన స్థావరాలను సృష్టిస్తాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

బ్యాక్టీరియా, వైరస్‌లతో అప్రమత్తత ఎంతో అవసరం:
బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు వల్ల టైఫాయిడ్, కలరా, కామెర్లు, అతిసారం, గ్యాస్ట్రో ఎంటెరిటిస్, ఇతర వైరల్ ఫీవర్లు, వ్యాధులు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడతారు.

వాహకాలు ద్వారా వ్యాపించే వ్యాధులు:
గుంతలు, పాత టైర్లు, కూలర్లు, మూతలు లేని పాత్రలలో నిలిచిన నీరు కారణంగాను, మురుగు డ్రెయిన్లు కారణంగా వివిధ వ్యాధులు వస్తాయి. మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోద వ్యాధులు రావడంతో ప్రజలు ఇక్కట్లు వర్ణణాతీతం.

గాలి ద్వారా వచ్చే వ్యాధులు:
వర్షకాలంలో ఉష్ణోగ్రతలు హెచ్చు తగ్గులు ఉంటాయి. పెరిగిన తేమ కారణంగా శ్వాస కోశ వ్యాధులతో పాటు, అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. సాధరణ జలుబు, ఫ్లూ, వైరల్ జ్వరాలు, అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉండటంతో ప్రజలు తగిన జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి. అధిక తేమ, నిరంతర తడి వాతావరణం, ఫంగల్, బ్యాక్టీరియా కారణంగా చర్మవ్యాధులు వస్తాయి. గజ్జి, తామర, చర్మంపై పుండ్లు, వాపులు, ఎర్రటి గడ్డలు, చీమి పొక్కులు ఇలాంటి వ్యాధులు వస్తాయి.

తగు జాగ్రత్తలు:
వర్షకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తరచుగా చేతులు కడగటం, క్రమం తప్పకుండా స్నానం చేయడం, చర్మాన్ని పొడిగా ఉంచుకోవడం, శుభ్రమైన దుస్తులు, ముఖ్యంగా ముఖాన్ని తాకకుండా చూసుకోవాలని, గోళ్లను కత్తిరించుకోవడం చేయాల్సి ఉంటుంది.

ఆహార నియమాలు పాటించాలి:
వీధి ఆహారంనకు దూరంగా ఉంటూ ఆహార నియమాలు పాటించాలి. రోగ నిరోధక శక్తి పెంచేందుకు అవసరమైన పోషక విలువలతో ఉన్న తాజా ఆహారం, తాజా పండ్లు, తాజా కూరలు తీసుకోవడం ఎంతో అవసరం. వేడి ఆహార పదార్థాలు తీసుకోవడం, చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలి. సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలి. సీ ఫుడ్, పాల ఉత్పత్తులు పట్ల అప్రమత్తత ఎంతో అవసరం. ఒత్తిడి లేని జీవితం, వర్షంలో తడవకుండా ఉండటం, వైద్య సహకారం తప్పని సరి.

దోమల నియంత్రణ ఎంతో అవసరం:
వర్షకాలంలో దోమలు సంతానోత్పత్తి పెరిగిపోతుంది. నియంత్రణ ఎంతో అవసనరం. పరిసరాలలో, ఇంటిలోను నీటి నిల్వలు లేకుండా చూడటం, రక్షణ దుస్తులు ధరించడం, దోమ నివారణ మందులు వాడటం ఎంతో అవసరం. దోమ తెరలు వాడటం వల్ల దోమలు ద్వారా వచ్చే వ్యాధులు నుంచి రక్షణ పొందవచ్చు.




దోమల ఉత్పత్తి కేంద్రంగా పట్టణంలోని చెరువు, డ్రెయిన్‌లు, ఖాళీ స్థలాలు



మూతలు లేని కుండీలలో నీటి నిల్వలు



పక్కన పెట్టిన పాత టైర్లు

వర్షకాలంలో జాగ్రత్తలు పాటించండి



వర్షకాంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి. సమీప పరిసరాలను, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వ్యాధులు ప్రబలినప్పుడు తక్షణ వైద్య సహకారం కోసం పట్టణంలోని నాలుగు అర్బన్ హెల్త్‌సెంటర్‌లను, ఏరియా ఆసుపత్రిని సంప్రదించాలి. వైద్య సహకారం పొందాలి.

–ఎస్‌వీఎస్ ప్రసాద్, సబ్ యూనిట్ అధికారి

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇళ్లకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడెం పట్టణంలో 10వ రోజు బుధవారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. మహాలక్ష్మీనగర్, పరిసర ప్రాంతాలలో ప్రచార ర్యాలీ జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణలను, స్మార్ట్ మీటర్లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, కేంద్రం ఆదేశాలు మేరకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని వెల్లడించారు. అదానీ కంపెనీ రాష్ట్రంలోని రెండు కోట్లు మంది వినియోగదారుల పాత మీటర్లను తొలగించి, స్మార్ట్ మీటర్లు బిగిస్తుందని, ప్రజలు తప్పక వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరణ చేసేందుకు చూస్తున్నారని, సెల్‌ఫోన్ తరహాలోనే ముందుగానే కరెంటును కూడా రీఛార్జి చేసుకోవాలని చెప్పారు. బడా కంపెనీలు దేశంలో 23 లక్షల కోట్లు అడ్వాన్స్ రూపంలో జనం నుంచి గుంజుతారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు రూపంలో పెను భారాలు వేస్తుందని, వేల కోట్లు రూపాయిలు సర్దుబాటు చార్జీలు అమలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, దీంతో విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు బిగింపును ఆపకపోతే దశల వారీ ఆందోళన చేపడతామన్నారు. జవ్వాది శ్రీను, తోట శ్రీను, కన్నంరెడ్డి శివాజీ, ఎన్.సాయి, వి.అప్పారావు, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

‘కూటమిది నయవంచన పాలన’

అత్తిలి: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సమయంలో కూటమిపార్టీలు ఇచ్చిన హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి వాటిని ప్రజలకు అందించకుండా చేసారని విమర్శించారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను ఏడాదికిపైగా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేనపార్టీలు అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించారని, ఇంటింటికీ హామీల బాండ్లను పంపించి అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. ప్రతి నెలా ఏదోక సంక్షేమాన్ని అందించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సు గెలుచుకున్నారని, ప్రజల్ని ఎలా మోసం చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బుద్దరాతి భరణీ ప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షులు కునాధరాజు శ్రీహరిరాజు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రంభ సూరిబాబు, కంకటాల సతీష్, కాసగాని చిన్నా, రాపేటి సింహాచలం, పోలినాటి సూర్యచంద్రరావు, అనిల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: కొమ్మర గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఇరగవరం: అర్జునుడుపాలెం గ్రామంలో చంద్రబాబు చేసిన మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మాట తప్పడం చంద్రబాబు నైజం

ఇరగరం: బూటకపు హామీలతో అధికారంలోకి రావడం, గద్దెనెక్కాకమాట తప్పడం చంద్రబాబు నైజమని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని అర్జునుడుపాలెం, కత్తవపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 143హామీలిచ్చారని, వాటిలో ఏవీ అమలు చేయడం లేదన్నారు. మహిళలు, విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, ఉద్యోగస్తులు ఇలా అన్ని వర్గాలనూ కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఘోర పరాజయం తప్పదన్నారు. గత ప్రభుత్వంలో తూచా తప్పకుండా హామీలను అమలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జవ్వాది సురేష్, మూడిదాని బాలాజీ, కొండపల్లి దుర్గా ప్రసాద్, కంకిపాటి రామకృష్ణ, కంకిపాటి వెంకట్రావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో వాదనలు వినిపిస్తాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆఫీసర్స్ క్లబ్, కళా కేంద్రం స్థల వ్యవహారంలో బార్ అసోసియేషన్ తరుపున ఇంప్లీడ్ పిటిషన్ (మూడోవ పక్షాన్ని చేర్చడం) దాఖలు చేసి తమ వాదనలు హై-కోర్టులో విన్పిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, జనరల్ సెక్రటరీ పెదగాడి భూపాల్, సీనియర్ న్యాయవాది గొల్లపూడి ముఖర్జీ, న్యాయవాదులు తోట మురళిలు పేర్కొన్నారు. అసోసియేషన్ భవనంలో బుధవారం అసోసియేషన్ న్యాయవాదులు ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయకృష్ణ, ముఖర్జీ, ఇతర న్యాయవాదులు మాట్లాడుతూ కోర్టు సముదాయంలో అడిషనల్ జిల్లా కోర్టు కాకుండా నాలుగు కోర్టులు పనిచేస్తున్నాయని చెప్పారు. మరో కోర్టు రానున్నదని ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కోర్టు సముదాయాలకు వచ్చే కక్షిదారులు రోజురోజుకి పెరుగుతున్నారని, వాహనాలకు పార్కింగ్‌కు ఇబ్బందులు ఉన్నాయని, కోర్టు సముదాయానికి ముఖ ద్వారంలో ఉన్న ఆఫీసర్స్ క్లబ్, కళా కేంద్రం ఉన్న స్థలం, కోర్టులకు రెండోవ దారి నిమిత్తం ఎంతో అవసరమని చెప్పారు. కళా కేంద్రం ఆధ్వర్యంలో హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారని, దీంతో తమ వాదనలు వినిపించేందుకు తాము కూడా ఇంప్లీడ్ పిటీషన్ వేసి తమ వాదనలు హైకోర్టులో తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు ఎం.అర్జయ్య, తోట రాంబాబు, మణిరాజు, దశరథరామ్, ఆదినారాయణ, ఆకాంత్, శేషు, కేవీ సత్యనారాయణ, నయినాల స్వామి, ఎం.శ్రీనుబాబు, బాషా, శివకుమార్, భద్రుడు, జగదీష్, శ్రీనివాస్, న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, ఇతర న్యాయవాదులు

ప్రేమ, ఆకర్షణ, ఆశలకు బాలికలు లొంగవద్దు

తణుకు అర్బన్: ప్రేమ, ఆకర్షణకులోనై బాలికలు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మాయమాటలకు లొంగకుండా సమాజంలో ధైర్యంగా మెలగాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తణుకు సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలు నిరంతరం జాగ్రత్తతో మెలగాలని, కొన్ని ముఠాలు కొంతమంది ఆడపిల్లలను టార్గెట్ చేసి వారి జీవితాలు నాశనం చేస్తున్నారని, ఆశలు చూపించి మహిళలను మోసం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పిల్లలను అంగవికలాంగులుగా మారుస్తున్నారని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని పరిశీలించి మంచి, చెడు గమనించి జాగ్రత్తగా మెలగాలని తెలిపారు. న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, పోణంగి శ్రావణి సమీరా, కామన ముని స్వామి, ఐ కిరణ్మయి, పి. దనుంజయ రావు, పారా లీగల్ వలంటీర్‌లు గంట అజోర్, కాకర్ల నాని, ఏఎస్ఐ కృష్ణమూర్తి, వార్డెన్ మేరీ కమల కుమారి పాల్గొన్నారు.



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

స్త్రీలపై పెరుగుతున్న అత్యాచారాలు

పెనుగొండ: ప్రపంచంలో స్త్రీలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వారిని కించపరిచే విధంగా సంఘటనలు జరుగుతున్నాయని రక్షణ సైన్యం ప్రార్థన మందిరం సభ్యులు జల్లి జ్యోతి అన్నారు. బుధవారం ఆచంట పెదపేటలోని రక్షణ సైన్యం ప్రార్థన మందిరంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తణుకు డీహెచ్‌ఓ కెప్టెన్ చదలవాడ మోహనరావు, రాజ్‌కుమార్, కెప్టెన్లు చైతన్య, మేరీ, రక్షణ సైన్యం సేవకురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించకుండా సవ్యమైన రీతిలో స్కానింగ్ సెంటర్ల నిర్వహణ సాగాలని సూచించారు. బుధవారం ఆర్డీఓ తన చాంబర్‌లో సబ్‌డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీమెంబర్ అతారిటీ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ 1996 చట్టం ప్రకారం లింగనిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. స్కానింగ్ సెంటర్‌లపై నిరంతర నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వి.ప్రసాద్, కమిటీ సభ్యులు చల్లా దానయ్యనాయుడు, డాక్టర్ జెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.చిక్కాల శివాలయంలో ప్రత్యేక పూజలు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని శివదేవుని చిక్కాలలో ఉన్న శివదేవస్వామి ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం నిర్వహించారు. బుధవారం శ్రావణ మాస షష్ఠి సందర్భంగా ఆలయ అర్చకులు ర్యాలీ సూర్యప్రకాష్ బ్రహ్మత్వంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

దళిత సర్పంచ్‌కు అవమానం

పాలకొల్లు సెంట్రల్: దిగమర్రు సొసైటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్‌కు అవమానం జరిగింది. సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్‌కు సొసైటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ఆహ్వాన సమాచారం ఇచ్చినా అక్కడ స్టేజీపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో, గ్రామంలో ఏర్పాటు చేసిన బ్యానర్లపై ఎక్కడా సర్పంచ్ ఫొటో లేకపోవడంతో కరుణాకర్ ప్రమాణ స్వీకారాన్ని బాయ్‌కాట్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్న తమ పార్టీకి చెందిన సర్పంచ్ అయినా ఎందుకు రాలేదనే ఆలోచన లేకపోవడం గమనార్హం. అయితే కరుణాకర్ ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. తాను దళిత సర్పంచ్‌ననే కారణంతోనే ఈ కార్యక్రమంలో తన ఫొటో ఎక్కడా లేకుండా చేశారని, అందుకే తాను ఈ కార్యక్రమాన్నికి వెళ్లకుండా బాయ్‌కాట్ చేశానని ఆయన సన్నిహితులతో చెబుతున్నారు.

ప్రతి రక్తపు బొట్టు విలువైనదే

భీమవరం అర్బన్: ప్రతి రక్తపు బొట్టు విలువైనదని, రక్తదానం చేయడం ద్వారా దాతల ఆరోగ్యం మెరుగుపడుతుందని జిల్లా సర్వే, భూమి రికార్డు శాఖ అధికారి కె. జాషువా అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో బుధవారం జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా సర్వే, భూమి రికార్డు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి రికార్డుల శాఖ అధికారి కె. జాషువా మాట్లాడుతూ నిత్యం రక్తం అవసరమై ఎంతోమంది ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎమ్ఎస్‌వీఎస్ భద్రిరాజు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ, మల్లేశ్వరరావు, వీరభద్రచారి, బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సెంట్.ఆన్స్ విద్యాసంస్థలు
తాడేపల్లిగూడెం, భీమవరం
BELLWETHER INTERNATIONAL SCHOOL,TANUKU



గత 29 సం॥లుగా ఆదర్శ ఉపాధ్యాయునిగా విధి నిర్వహణలో విశిష్ట సేవలందించి, ఎంతోమంది విద్యార్థుల ఉన్నతికి ఉత్తమ బాటలు వేసి నేడు ఉద్యోగ విరమణ చేయుచున్న శుభసందర్భంలో మీ భావిజీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ...
భార్య: బందెల లలిత కుమారి
కుమారుడు: సబ్బితి కోల్విన్ ఛార్లెస్
కుమార్తె - అల్లుడు: డా.మోనిక - డా.చింతలపూడి సూర్యప్రకాష్
అక్క - బావగారు: మరపట్ల లీలా సుందరి - డేవిడ్ రాజు
మేనకోడలు-మేనకోడలి భర్త: జి.దివ్యారాజ్ - జి.సునీత్ డేనియల్
అన్నయ్య - వదిన : రెవ.డా.సబ్బితి జయప్రకాష్ - లిల్లీ USA
అన్నయ్య కుమారులు: సబ్బితి విజయా పాల్ ప్రకాష్, సబ్బితి జేసన్ జయప్రకాష్
వదిన - తోడల్లుడు: పొట్నూరి శాంతకుమారి - క్రాంతినాథ్ (లేటు)
వదిన గారి కుమారులు: పొట్నూరి నిత్యానంద్ నిఖిల్ - అపూర్వ, జేడెన్ సుహాస్
పొట్నూరి అగస్టీన్ ప్రతీక్
బావ మరిది - చెల్లెలు : బందెల శ్యామ్ బాబు - జోస్ఫీ లక్ష్మి
బావ మరిది కుమారుడు: బందెల అగస్టీన్ క్రిస్టోఫర్
బావ మరిది కుమార్తె : బందెల క్రిస్టినా జసింతా

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం తణుకు
90102 23729
90100 68395
90100 51493
Office mail : tpgadvt@gmail.com